

మద్యానికి దూరంగా.. 2

2 బీటెక్ విద్యార్థి ఆత్మహత్య



మాల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి 2



www.aksharatoday.com

# అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND




నగరంలోని బీఎల్ఎన్ గార్డెన్‌లో ఆదివారం నగర పద్మశాలి సంఘం కార్యవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. - అక్షరటుడే, నిజామాబాద్ సిటీ


22-6-2025 (SUNDAY) NIZAMABAD/KAMAREDDY EDITION PAGES-2


## మానసికోల్లాసానికి క్రీడలు అవసరం



**అక్షరటుడే నిజామాబాద్ సిటీ:** మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో ఉపయోగపడతాయని సీపీ సాయి చైతన్య పేర్కొన్నారు. కమిషనరేట్ పరిధిలోని అన్ని విభాగాలకు సంబంధించి క్రికెట్ పోటీలను ఆదివారం ఆయన పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పోలీసు ఉద్యోగం నిత్యం ఒత్తిడితో కూడుకుని ఉంటుందన్నారు. దీంతో క్రీడల్లో పాల్గొంటే ఒత్తిడికి దూరం కావొచ్చని స్పష్టం చేశారు. నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ సబ్‌డివిజన్, ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగం, అలైడ్ బ్రాంచ్‌లు, హోంగార్డ్స్ విభాగాల మధ్య క్రికెట్ మ్యాచ్‌లు జరిగాయి. అదనపు డీసీపీ(అడ్మిన్) బస్వారెడ్డి, అదనపు డీసీపీ రామ్ చందర్ రావ్, ఏసీపీలు రాజా వెంకట్ రెడ్డి, పి.శ్రీనివాస్, వెంకటేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

## మెడికల్‌లలో ధర్మబద్ధంగా వ్యాపారం జరగాలి



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** మెడికల్ షాపుల్లో ధర్మబద్ధంగా వ్యాపారం జరగాలని కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ శ్రీనివాస్ అన్నారు. నగరంలోని మున్నూరుకాపు సంఘం జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నకిలీ మందులు అమ్మి కోర్టుల చుట్టూ తిరుగవద్దన్నారు.
కొన్నిరకాల మందులను నేరుగా సూపర్ మార్కెట్లు, కిరణా షాప్‌లలో అమ్మేందుకు అనుమతి ఇవ్వడం వల్ల మెడికల్ వ్యాపారులకు నష్టం వస్తోందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్, కోశాధికారి రాజు, రాష్ట్ర నాయకులు వెంకటి, అరవింద్, నర్సయ్య, చంద్ర శేఖర రావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా సంఘానికి ఎన్నికలు నిర్వహించారు.



# 'సాగర్' కింద సాగుకు సన్నద్ధం..

**ఉమ్మడి జిల్లా వరప్రదాయిని నిజాంసాగర్‌లో నీటి మట్టం ఆశాజనకంగా ఉండటంతో రైతులు పంటల సాగుకు సిద్ధం అవుతున్నారు. ప్రస్తుతం వర్షాలు సమృద్ధిగా పడుతుండటం.. జలాశయంలో నీరు పుష్కలంగా ఉండటంతో వానాకాలం సీజన్‌లో వరినాట్లకు అన్నదాతలు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ప్రాజెక్ట్‌లో ఆరు టీఎంసీల నీరు ఉండటంతో నెల రోజుల ముందుగానే నాట్లు వేయనున్నారు. ఇప్పటికే నారు పోసిన రైతులు త్వరలో నాట్లు వేయాలని చూస్తున్నారు.**

■ ఆశాజనకంగా నీటిమట్టం ■ వరినాట్లకు సిద్ధం అవుతున్న రైతులు

**అక్షరటుడే, నిజాంసాగర్:** నిజాంసాగర్ ప్రాజెక్టు కింద 2.35 లక్షలు ఎకరాల ఆయకట్టు ఉంది. అయితే అలీసాగర్ రిజర్వాయర్ వరకు గల 1.5 లక్షల ఎకరాల ఆయకట్టుకు మాత్రమే ప్రాజెక్ట్ నీరు అందిస్తున్నారు. మిగతా ఆయకట్టుకు గుత్ప అర్గుల్ రాజారాం ఎత్తిపోతల ద్వారా సాగునీరు అందిస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్ట్‌లో నీరు ఉండటంతో పాటు వర్షాలు పడుతుండటంతో రైతులు వానాకాలం సీజన్‌ను ఢోకా లేదని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### ఆ మండలాల్లో ఆలస్యం

నిజాంసాగర్ జలాశయం నుంచి కామారెడ్డి జిల్లాలో నిజాంసాగర్, మహమ్మద్ నగర్, బాన్సువాడ, బీర్కూర్, నస్రుల్లాబాద్ మండలాలకు సాగు నీరు అందుతుంది. మొత్తం డిస్ట్రిబ్యూటరీ 26 వరకు 33 వేల



ఎకరాల ఆయకట్టు ఉంది. మిగతా ఆయకట్టు నిజామాబాద్ జిల్లాలో ఉంది. ప్రాజెక్ట్ నుంచి డిస్ట్రిబ్యూటరీ 49 వరకు సాగు నీరు అందించనున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో నీటి నిల్వ ఆశాజనకంగా ఉండడంతో బాన్సువాడ, బీర్కూర్, వర్ని రుద్రూర్, నస్రుల్లాబాద్, కోటగిరి నవీపేట, ఎడపల్లి మండలాల్లోని రైతులు నారుమలను సిద్ధం చేసుకున్నారు. నిజాంసాగర్, మహమ్మద్ నగర్ మండలాల రైతులు మాత్రం ఆలస్యంగా నారు పోస్తున్నారు. మొదటి ఆయకట్టు ప్రాంతం కావడంతో పాటు బోరు బావులు లేక ప్రధాన కాలువ పైనే ఇక్కడి రైతులు ఆధార పడ్డారు. దీంతో ప్రధాన కాలువకు నీరు వదిలితేనే వీరు నారుమడులు సిద్ధం చేసుకుంటారు. ప్రాజెక్టు నీటిమట్టం 1405 అడుగులు (17.80 టీఎంసీలు) కాగా ప్రస్తుతం 1393.42 అడుగులు 5.80 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దీంతో వానాకాలం సాగుకు ఇబ్బంది లేదని అన్నదాతలు అంటున్నారు. నారుమడుల కోసం ప్రధాన కాలువకు నీటిని వదలాలని కోరుతున్నారు.


### నారు పోస్తున్నాం



నిజాంసాగర్ ఆయకట్టు కింద భూములను దుక్కి చేసి నారుమళ్లు సిద్ధం చేసుకుంటున్నాం. వారం పది రోజుల నుంచి కురిసిన వర్షాలు భూములకు మేలు చేశాయి. ఈ వర్షాలతో నారు పోసి, పంటల సాగుకు ముందుకు వెళు _న్నాం.

- మనీశ్ రెడ్డి, రైతు, బూర్గుల్

### ప్రధాన కాలువ నీరే ఆధారం



సాగర్ ఆయకట్టు కింద మాకు రెండు ఎకరాల భూమి ఉంది. బోరుబావులు లేకపోవడంతో ప్రధాన కాలువ నీటి ఆధారంగానే పంటలు వేస్తాం. కాలువకు నీరు వదిలితేనే నారు పోస్తాం. అయితే ప్రస్తుతం సాగర్ నీరు ఎక్కువగా ఉండటంతో గతంలో కంటే ముందుగానే నాట్లు వేయాలని భావిస్తున్నాం.

- ఈశ్వర్ గౌడ్, రైతు, మహమ్మద్‌నగర్

## రైతు భరోసా కేవలం ఎన్నికల స్టంట్ మాత్రమే..

**అక్షరటుడే, ఇందూరు:** రైతు భరోసా అనేది కేవలం ఎన్నికల స్టంట్ మాత్రమేనని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో రైతులను మరోసారి మోసం చేసే ప్రయత్నం కాంగ్రెస్ చేస్తోందని ఆయన పేర్కొన్నారు. రైతుబంధు, రుణమాఫీ పూర్తిస్థాయిలో అందించని కాంగ్రెస్‌కు స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్లు అడిగే నైతిక హక్కు లేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డికి రైతులపై ప్రేమ లేదని, ఓట్ల కోసం మాత్రమే నటిస్తున్నారన్నారు.




మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి

### బీజేపీ, కాంగ్రెస్ రెండూ ఒక్కటే..

రాష్ట్రంలో యూరియా కొరత తీవ్రంగా ఉందని, దానిపై దృష్టి సారించాలని ప్రశాంత్ రెడ్డి సూచించారు. కాంగ్రెస్, బీజేపీ రెండు ఒకటేనని అందుకే బీజేపీ ఎంపీలు ఉన్నచోట మంత్రి పదవులు ఇవ్వడం లేదని విమర్శించారు.

## స్థానిక ఎన్నికలపై ఇంకా నిర్ణయం జరగలేదు

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ త్వరలో వెలువడు తుందని ఇటీవల పలువురు మంత్రులు ప్రక టన చేశారు. నెలాఖరులో షెడ్యూల్ విడుదల చేసి వచ్చే నెలలో ఎన్నికలు నిర్వహిస్తారని ప్రచారం జరిగింది. మొదట ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు నిర్వహిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించారు. దీంతో పల్లెల్లో ఆశావహులు, నాయకులు ఎన్నికల కోసం సిద్ధం అవుతున్నారు. ఈ క్రమంలో పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు.

### ఇంకా నిర్ణయం జరగలేదు

మహేశ్‌గౌడ్ ఆదివారం నిజామాబాద్‌లో మాట్లాడారు. స్థానిక ఎన్నికలపై ఇంకా



మాట్లాడుతున్న పీసీసీ చీఫ్ బొమ్మ మహేష్ కుమార్

నిర్ణయం జరగలేదని ఆయన తెలిపారు. మంత్రివర్గంలో చర్చించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలపై నిర్ణయం ప్రకటిస్తామన్నారు. ఈ నెల 16న జరిగిన మంత్రివర్గ సమావేశంలోనే స్థానిక ఎన్నికలపై చర్చించి ప్రకటన చేస్తారని ప్రచారం జరిగింది. కానీ ఆ రోజు ఎలాంటి ప్రకటన వెలువడలేదు.

# మద్యానికి దూరంగా..

■ ఆదర్శంగా నిలుస్తున్న గ్రామాలు ■ మద్య నిషేధం అమలు ■ భారీ జరిమానా విధించేందుకు సిద్ధం

**ప్రస్తుతం మందు దొరకని పల్లె లేదంటే అతిశయోక్తి కాదు. వైన్ షాపులకే పరిమితం కావాల్సిన మద్యం ప్రతి గ్రామంలో దొరుకుతోంది. విచ్చలవిడిగా బెల్టుషాపులు ఏర్పాటు చేసి మద్యం విక్రయిస్తున్నారు. దీంతో ఎంతో మంది మద్యానికి బానిసలుగా మారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. ఈ క్రమంలో పలు గ్రామాలు మద్య నిషేధాన్ని అమలు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాయి. ఊరంతా ఏకమై.. మందుకు వ్యతిరేకంగా తీర్మానాలు చేస్తున్నారు. ఏదైనా గ్రామంలో మద్యం అమ్మితే భారీ జరిమానాలు వేస్తామని ప్రకటిస్తున్నారు.**


గుండారం గ్రామం

**అక్షరటుడే, కామారెడ్డి :** గ్రామ సరిహద్దుల్లో ఎక్కడపడితే అక్కడ సిట్టింగులు నిర్వహిస్తున్న తరుణంలో గ్రామస్థులు అప్రమత్తమయ్యారు. కళ్లముందే తమ పిల్లలు చెడిపోతుండటంతో తల్లిదండ్రులు ఒక్కటై గ్రామాల్లో మద్యపాన నిషేధానికి ముందుకు వస్తున్నారు. అందులో భాగంగానే గ్రామమంతా ఏకమై మద్యం విక్రయాలు, మద్యపానం నిషేధం విధిస్తూ తీర్మానాలు చేస్తున్నారు. కేవలం రెండు రోజుల వ్యవధిలో రాజంపేట మండలంలోని నాలుగు గ్రామాల్లో తీర్మానాలు చేయడం గమనార్హం.

## విచ్చలవిడిగా బెల్టు షాపులు

పదేళ్ల క్రితం మద్యం కావాలంటే కామారెడ్డి పట్టణానికి వచ్చి తీసుకెళ్లే పరిస్థితి ఉండేది. కానీ ఇప్పుడు ప్రతి గ్రామంలో బెల్ట్ షాపులు ఉన్నాయి. అంతేగాకుండా పలు గ్రామాల్లో బెల్ట్ షాపుల నిర్వహణకు వేలంపాట నిర్వహిస్తున్నారు. అయినా ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో పచ్చని పల్లెల్లో మద్యం ఏరులై పారుతోంది. గ్రామాల్లో ఏ సమయంలోనైనా మద్యం దొరుకుతుండటంతో యువత దానికి బానిసలుగా మారుతున్నారు.

## కొత్త ఒరవడికి శ్రీకారం

మద్యం విక్రయాలు, మద్యపానం ఎక్కువ అవుతుండటంతో పలు గ్రామాల ప్రజల్లో ఆలోచన మొదలైంది. మద్యం విక్రయాలకు అడ్డుకట్ట వేసేందుకు కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారు. మద్యపాన నిషేధాన్ని అమలు చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు గ్రామస్థులంతా ఓచోట సమావేశమై మద్య నిషేధానికి సంబంధించి తీర్మానం చేస్తూ ఏకగ్రీవ నిర్ణయం తీసుకుంటున్నారు.

## ఉల్లంఘిస్తే కఠిన శిక్షలు

రాజంపేట మండలంలోని పలు గ్రామాల్లో చేసిన తీర్మానాలు జిల్లాలో చర్చనీయాంశంగా మారాయి. రెండు రోజుల క్రితం కొండాపూర్, గుడితండా పంచాయతీల్లో తీర్మానం చేయగా శుక్రవారం గుండారం, ఎల్లాపూర్ తండా, నడిమి తండా పంచాయతీల్లో మద్యపానం నిషేధిస్తూ ఏకగ్రీవ తీర్మానాలు చేశారు. అంతే కాకుండా తీర్మానాన్ని ఉల్లంఘిస్తే రూ.లక్ష జరిమానా.. ఏడు చెప్పు దెబ్బలు అని ప్రకటించారు. అలాగే గ్రామ సరిహద్దు వరకు ఎక్కడ మద్యం సేవించినా కఠిన శిక్షలు ఉంటాయని హెచ్చరించారు. మద్యం విక్రయిస్తున్న వారి వివరాలు చెప్పిన వారికి రూ.20 వేల బహుమతి సైతం ప్రకటించారు.

## గొడవలు జరుగుతున్నాయి



గ్రామంలో మద్యం విక్రయాలు ఎక్కువయ్యాయి. ఎక్కడ పడితే అక్కడ బైక్‌లు ఆపి మద్యం సేవిస్తున్నారు. ఆ సమయాల్లో గొడవలు సైతం జరుగుతున్నాయి. అందుకే మద్యం విక్రయాలపై కఠిన నిర్ణయం తీసుకున్నాం. ఈ విధానం పక్కాగా అమలు చేస్తాం.

- కమ్మరి విజయ్, యువకుడు, గుండారం

## అందరూ బాగుండాలని..



పచ్చని కాపురాల్లో మద్యం చిచ్చు పెడుతోంది. యువత మద్యానికి బానిస అవుతున్నారు. అందుకే మద్య నిషేధం తీర్మానం చేశాం. అందరూ బాగుండాలని ఈ నిర్ణయం తీసుకున్నాం.

- మధు, మాజీ ఉప సర్పంచ్, ఎల్లాపూర్ తండా

## కళ్లముందే ప్రాణాలు పోతున్నాయి



ఉద్యోగాలు చేస్తూ కుటుంబానికి ఆసరాగా ఉండాల్సిన యువత మద్యానికి బానిస అవుతున్నారు. గ్రామాల్లోనే మద్యం లభిస్తుండటంతో శివారుల్లో తాగుతున్నారు. మద్యం మత్తులో బైక్‌లపై వెళ్తూ ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారు. దీంతో నిషేధం అమలు చేయాలని నిర్ణయించాం.

- వినోద్, నడిమి తండా

## ఆలయానికి బోరు మోటారు అందజేత



**అక్షరటుడే, బాన్సువాడ:** నస్రుల్లాబాద్ మండలం అంకోల్ క్యాంప్ గ్రామంలో బీరప్ప మందిరానికి ఎన్ఆర్ఐ కోనేరు శశాంక్ ఆదివారం బోరు మోటారు పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా నాయకుడు సున్నం సాయిలు మాట్లాడుతూ గతంలో కోనేరు శశాంక్ ఆలయానికి బోరు పరికరాలు ఇస్తానని ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలపాటి హరికృష్ణ, కృష్ణంరాజు, మేకల రామన్న యాదవ్, శ్రీనివాస్, మహేష్, రామన్న, కంది పెద్ద మల్లేష్, గంగాధర్ గుప్తా, ఉల్లెంగ గోపి తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్యలను పరిష్కరించాలి



**అక్షరటుడే, కామారెడ్డి గ్రామీణం:** రైతులకు సంబంధించిన విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు పైడి విఠల్ డిమాండ్ చేశారు. పాల్వంచ మండలంలో ఆదివారం కిసాన్ సంఘ్ మండల అధ్యక్షుడు తోట సాయిలు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థాయిలో కార్యకర్తలకు ఇచ్చే శిక్షణ కార్యక్రమాలతో పాటు రెవెన్యూ సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో కిసాన్ సంఘ్ మండల కార్యదర్శి తిరుపతిరావు, రాములు, మనోహర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మార్కండేయ ఆలయంలో ప్రత్యేక పూజలు



**అక్షరటుడే, కామారెడ్డి గ్రామీణం:** జిల్లా కేంద్రంలోని మార్కండేయ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు బ్రహ్మశ్రీ గంగవరం ఆంజనేయ శర్మ ఆధ్వర్యంలో భరణి నక్షత్రాన్ని పురస్కరించుకొని, ఆయుష్య అభివృద్ధి, ఆరోగ్య సాధన కోసం భక్తులు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఏఎంసీ ఛైర్మన్‌ను పరామర్శించిన కాసుల



**అక్షరటుడే, బాన్సువాడ:** వర్ని మార్కెట్ కమిటీ ఛైర్మన్ సురేష్ బాబా ఇటీవల కారు ప్రమాదంలో గాయపడగా ఆగ్రో ఇండస్ట్రీస్ ఛైర్మన్ కాసుల బాలరాజ్ ఆదివారం పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట బాన్సువాడ మున్సిపల్ మాజీ ఛైర్మన్ జంగం గంగాధర్, నాయకులు ఎజాజ్ తదితరులున్నారు.

## సమ సమాజ స్థాపనకు కృషి


**అక్షరటుడే, ఇందూరు:** సమసమాజ స్థాపనకు ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ కృషి చేస్తోందని జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు గౌడ్ అన్నారు.




పార్టీ 86వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నగరంలోని కార్యాలయంలో పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్యం కోసం నేతాజీ సుభాష్ చంద్రబోస్ 1939 జూన్ 22న పార్టీని ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. సమ సమాజ స్థాపన కోసం ఆయన ఆశయ సాధన కోసం పార్టీ పనిచేస్తోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు మానుకోవాలన్నారు. ప్రజల పక్షాన ఏఐఎఫ్‌బీ పోరాటం చేస్తోందని చెప్పారు.

## మాల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

**అక్షరటుడే, బాన్సువాడ:** రాష్ట్రంలో మాల కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి చేయాలని బాన్సువాడ మాల సంఘం నాయకులు



కోరారు. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్‌లో కార్మిక, ఉపాధి, భూగర్భ గనుల మంత్రి గడ్డం వివేక్ వెంకట స్వామికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాల సంఘం తెలంగాణ వ్యవస్థాపకుడు అయ్యల సంతోష్, బాన్సువాడ డివిజన్ అధ్యక్షుడు మీర్జాపురం సాయన్న, బోగాడమిది సాయిలు, సురేష్, పాండు, గంగాధర్, కోటగిరి మండల మాల సంఘం అధ్యక్షుడు భూమేష్, రాములు, సైదయ్య, పోతంగల్ మండల అధ్యక్షుడు జ్యోతిపాల్, గంగాధర్ పాల్గొన్నారు.

## బీటెక్ విద్యార్థి ఆత్మహత్య

**అక్షరటుడే,నిజామాబాద్ సిటీ:** రైలుకింద పడి ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటన నిజామాబాద్ నగరంలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని సాయినగర్ ప్రాంతానికి చెందిన రాజారపు శ్రీనివాస్ బీటెక్ పరీక్షల్లో ఫెయిల్ అయినప్పటికీ పాసయ్యానని ఇంట్లో కుటుంబసభ్యులకు చెప్పాడు. అయితే శ్రీనివాస్ ఫెయిల్ అయ్యాడని కుటుంబీకులకు తెలియడంతో వారు నిలదీశారు. దీంతో మనస్థాపానికి గురైన శ్రీనివాస్ రైలు కిందపడి శనివారం అర్ధరాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## విద్యుదాఘాతంతో షోరూం దగ్ధం

**అక్షరటుడే, బాన్సువాడ:** షార్ట్ సర్క్యూట్ కారణంగా షూ షోరూం దగ్ధమైంది. ఈ ఘటన పట్టణంలో ఆదివారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని బాటా షోరూంలో ఆదివారం మధ్యాహ్నం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దట్టంగా పొగ కమ్ముకోవడంతో పక్కనే ఉన్న దుకాణాదారులు ఇబ్బందులు పడ్డారు. సమాచారం అందుకున్న ఫైర్‌స్టేషన్ సిబ్బంది ఫైరింజన్‌తో మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఆస్తినష్టం వివరాలు తెలియాల్సి ఉంది.